క్లుప్తంగా

వెదజల్లే పద్ధతిలో వరి సాగు మేలు

కూసుమంచి: వెదజల్లే పద్ధతిలో వరి సాగుచేయడం వలన అనేక లాభాలు ఉన్నాయని ఏఓ వాణి అన్నారు. బుధవారం మండలంలోని నాయకన్‌గూడెంలో వెదజల్లే పద్ధతిలో వరిసాగుపై రైతులకు అవగాహన కల్పించిన సందర్భంగా మాట్లాడారు. వానాకాలం సాగుకు నార్లు పోసుకోని రైతులు ఈ పద్ధతిని అవలంభించాలన్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు పంట కాలం 15 రోజుల ముందే వస్తుందని, చీడపీడల బెడద తగ్గి, దిగుబడులు పెరుగుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

కవికి సన్మానం

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన కవి చిలకబత్తిన వీరబాబును కాంగ్రెస్ నాయకులు బుధవారం ఇటీవల కవి సామ్రాట్ అవార్డు అందుకున్న సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈమేరకు మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడగా.. కార్యక్రమంలో కొర్లకుంట్ల నాగేశ్వరరావు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజిని, సూరేపల్లి రవి, బచ్చలకూరి నాగరాజు, భద్రయ్య, మధార్, కడియాల నరేష్, కైలాసపు వెంకటేష్, మేకల వెంకటేశ్వర్లు, గరిడేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి సొసైటీ అడ్వైజర్‌గా 'నల్లమల'

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ అగ్రి, హార్టికల్చర్ సొసైటీ చీఫ్ అడ్వైజర్‌గా జిల్లాకు చెందిన నల్లమల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. 1953లో స్థాపించిన ఈ సొసైటీకి నూతన కమిటీని మంగళవారం హైదరాబాద్‌లో ఎన్నుకోగా ఆయనకు స్థానం దక్కింది. కాగా, నేల, నీరు, పర్యావరణం, ప్రజారోగ్యం పరిరక్షణకు పాటుపడుతూనే సేంద్రియ సాగుపై రైతుల్లో అవగాహన పెంచాలని నిర్ణయించారు.

మూగబోయిన మార్కెట్లు..


కాల్వొడ్డు వీధి వ్యాపారుల ప్రాంగణం బయట ప్రధాన రహదారిపై విక్రయాలు

- రూ.లక్షలు వెచ్చించినా రోడ్లపైనే వ్యాపారాలు
- ఖాళీగా దర్శనమిస్తున్న ప్రాంగణాలు
- సంచార జాతులకు నిలయంగా షెడ్లు
- దృష్టి సారించని అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: గత ప్రభుత్వ హయాంలో వీధి వ్యాపారుల ప్రయోజనం, వినియోగదారుల సౌకర్యార్థం, రహదార్ల వెంట ట్రాఫిక్ సమస్యలు తొలగించేందుకు నగరంలో వీధి వ్యాపారుల ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల ద్వారా రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారం చేస్తుండడంతో ఆదరణ కోల్పోయాయి. కాల్వొడ్డు, రోటరీనగర్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయగా.. అందులో పాత బస్టాండ్ ప్రాంగణంలో మాత్రమే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఇతర వస్తువులు విక్రయిస్తుండగా.. మిగతా రెండు ప్రాంగణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ రెండు ప్రాంతాలు వ్యాపార కూడళ్లుగా విరాజిల్లుతున్నా.. అందులో విక్రయాలకు వ్యాపారులు ఆసక్తి కనబర్చడం లేదు.

ఇతర మార్కెట్లుగా మార్చిడి..

ఇటీవల రోటరీనగర్ వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని మామిడి రైతు మార్కెట్‌గా, పండ్ల మార్కెట్‌గా అభివృద్ధి చేయాలని జిల్లా అధికార యంత్రాంగం కృషి చేసింది. ఈక్రమాన మామిడి మార్కెట్‌గా మార్చి ప్రారంభించినా ఆదరణకు నోచుకోలేదు. ప్రారంభంలో ఈ ప్రాంగణాల్లో స్థానం కోసం రాజకీయ నాయకుల నుంచి వ్యాపారులు పైరవీలు కూడా చేయించుకున్నారు. అయినా రోడ్ల వెంటటే వ్యాపారాలను కొనసాగిస్తున్నారు.

అంతా ఖాళీగానే..

నగరంలో కాల్వొడ్డు వ్యాపార కూడలిలో ఎలాంటి వ్యాపారాలు చేయకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తోంది. ప్రాంగణం చుట్టూ ప్రధాన రహదారి వెంట ఉన్న ఎస్సీ, ఎస్టీ సంస్థలకు చెందిన వ్యాపార సముదాయల కారణంగా తమ వ్యాపారాలు సాగడం లేదని వ్యాపారులు పేర్కొంటూ గతంలో మాదిరిగా రోడ్ల వెంట విక్రయాలు చేస్తున్నామంటున్నారు. రద్దీగా ఉండే కాల్వొడ్డు ప్రధాన రహదారి, ట్రంక్ రోడ్ వైపు రహదారి వెంట తోపుడు బండ్లపై వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. అంతేగాక చెత్త చెదారం రహదార్లపైనే చేరుతుంది.


ఖాళీగా దర్శనమిస్తున్న ప్రాంగణం

సంచార జాతులకు నిలయంగా..

వీధి వ్యాపారుల ప్రాంగణాలు నిర్వహణలో లేకపోవడంతో సంచార జాతుల వారికి నిలయాలుగా మారాయి. కొందరు నివాసాలుగా మార్చుకుని తమ వ్యాపారాలు నిర్వహిస్తుంటే మరికొందరు ఆటోలను, ద్విచక్రవాహనాలకు పార్కింగ్ స్థావరాలుగా మార్చుకుంటున్నారు. దీంతో పాటు ప్రాంగణాల్లో చెత్తచెదారం వేస్తూ అధ్వానంగా మార్చడంతో పాటు మల, మూత్రాలకు వీటిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వ శాఖలు దృష్టి సారిస్తే ప్రాంగణాలు వ్యాపార కేంద్రాలుగా విరాజిల్లడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం ఉంటుంది.


సంచార జాతులకు నిలయంగా ప్రాంగణం

రోడ్లపైనే వ్యాపారాలు..



వీధి వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన ప్రాంగణాలను నిర్వహణలోకి తీసుకురావాలి. ప్రాంగణాలు ఉన్నాకాని వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు చేయడం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికతో వ్యాపారులకు ప్రయోజనం కలిగేలా తగిన చర్యలు తీసుకోవాలి.

– చింతల దినేష్, నాయుడుపేట

నిర్వహణలోకి తీసుకురావాలి..



నిరుపయోగంగా, నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రాంగణాలను నిర్వహణలోకి తీసుకురావాలి. వీధి వ్యాపారులు ఆదరించకపోవడంతో ద్విచక్రవాహన మెకానిక్‌లుగా తమకు కేటాయించాలని జిల్లా కలెక్టర్, మున్సిపాలిటీ అధికారులకు వినతి పత్రాలు కూడా అందించాం.

– చాంద్‌మియా, మెకానిక్, కాల్వొడ్డు

అర్హులందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు


మద్రిగూడెంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలు ఏన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న సొంత ఇంటి కల కాంగ్రెస్ పాలనలో నెరవేరుతుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వడం లేదని, వారు ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు కాంగ్రెస్‌వైపే ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష అని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాలన్నారు. అనంతరం లింగాల కేజీబీవీ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీఈఓ సామినేని సత్యనారాయణ, జీసీడీఓ తులసీ, గింజల నరసింహారెడ్డి, ధనియాకుల హన్మంతరావు, మేకల మల్లిబాబుయాదవ్, ఆరెం రవి, నల్లమోతు లక్ష్మయ్య, దమ్మాలపాటి సత్యనారాయణ, దేవండ్ల నాగేశ్వరరావు, రాయల నవీన్, మాలోత్ సరిరాంనాయక్, ప్రేమ్‌కుమార్, పర్హా తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ఇళ్ల పట్టాల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసులతో గ్రామానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ జగ్రామ్, ప్రత్యేక అధికారి నగేష్, గ్రామ సెక్రటరీ కృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాపా ఆదినారాయణ, ధార మాధవరావు, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు బానోతు కిషోర్, కిలారు రమణ, ధరావత్ వీరునాయక్, కుతుంబక సత్యనారాయణ, రాపర్తి రాజా, తగరం ఆదామ్, తగరం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలనలో ప్రభుత్వ రంగాలు నిర్వీర్యం'


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో ప్రభుత్వ రంగాలు నిర్వీర్యం చేసి ప్రజలపై ఆర్థిక భారాలు మోపడమే ప్రధాని మోదీ లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. పెంచిన రైల్వే చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన ఖమ్మం రైల్వే స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 11ఏళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు కారుచౌకగా కట్టబెట్టే పనిలో మోదీ ఉన్నారని, ఇప్పుడు రైల్వే వ్యవస్థల ఆస్తులపై పడిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ప్రయాణించే రైల్వే చార్జీలను తగ్గించి ప్రయాణికులపై భారం పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు ఎంఏ జబ్బార్, డి.తిరుపతిరావు, ఎస్.నవీన్‌రెడ్డి, బి.సుదర్శన్, భుక్యా శ్రీనివాసురావు, బి.ఉపేందర్, నాగులు మీరా, పి.నాగసులోచన పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు కరకట్ట నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఖమ్మం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన ప్రతినిధుల బృందం 35వ డివిజన్ మోతీనగర్ ప్రాంతంలో మున్నేరు కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది వచ్చిన వరదలతో నష్టపోయిన వారికి నేటికీ పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం అందలేదన్నారు. కరకట్ట నిర్మాణ పనులను ప్రారంభించి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు సగం పనులు కూడా కాలేదన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యాన మున్నేరు లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, త్వరగా కరకట్ట నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం త్రీటౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, నాయకులు బండారు యాకయ్య, షేక్ సైదులు, షేక్ హిమామ్, వేల్పుల నాగేశ్వరరావు, షేక్ అమీనా, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

లకారంలో ట్రయల్ రన్


ట్రయల్ రన్ నిర్వహిస్తున్న రెస్క్యూ టీం సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలంలో భారీ వర్షాలతో వచ్చే వరదలు, విపత్తులను ఎదుర్కొనేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు రెస్క్యూ టీంను సిద్ధం చేస్తున్నారు. బుధవారం డీఆర్ఎఫ్ సిబ్బంది నైపుణ్యాన్ని పరీక్షించేందుకు లకారం చెరువులో బోట్లతో ట్రయల్ రన్ నిర్వహించి ప్రజలను ఎలా రక్షించాలనే అంశాలపై నిపుణులు తర్ఫీదు ఇచ్చారు.

ప్రీ–మాన్‌సూన్‌పై సమీక్ష

వర్షాలు కురుస్తున్న నేపథ్యాన నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ పారిశుద్ధ్య విభాగ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం కేఎంసీలో ప్రీ–మాన్‌సూన్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం చేయొద్దని, డ్రెయినేజీల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

సంక్షిప్తంగా..

సాయినాథునికి జలాభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని త్రీటౌన్ రంగనాయకుల గుట్ట శ్రీకృష్ణ సాయి ఆశ్రమం సాయినాథునికి బుధవారంమాలాధారణ భక్తులు 108 కలశాలతో మున్నేటి నుంచి జలాన్ని తీసుకువచ్చి జలాభిషేకం చేశారు. తొలుత వేకువజామున ఐశ్వర్య ప్రాప్తిని కాంక్షిస్తూ ఆవునెయ్యితో సాయిబాబాకు అభిషేకం చేసి ఆశ్రమంలో సుదర్శన హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు సిద్దంశెట్టి నాగమణి, స్వరాజ్యలక్ష్మి, కృష్ణారావు, మురళి, కృష్ణకుమారి, నాగేశ్వరరావు, సంధ్య, సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, లలితమ్మ, విజయ, సరళ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ ఆధ్వర్యాన బుధవారం క్లబ్ కార్యాలయంలో ఘనంగా డాక్టర్ డే నిర్వహించారు. ఈ సదర్భంగా వైద్యరంగంలో విశిష్ట సేవలందించిన వైద్యులు ఆచవరపు రాఘవరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, కె.వినయ్‌కుమార్‌రెడ్డి, శీలం శరీన్‌రెడ్డిలను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు కన్మంతరెడ్డి ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో క్లబ్ ప్రతినిధులు సుంకు నాగిరెడ్డి, పెసర ప్రభాకర్‌రెడ్డి, దగ్గుల మాధవరెడ్డి, కట్టా సత్యనారాయణరెడ్డి, సుధాకర్, దామా స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

5న ఇసుక వేలం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని పోలీసులు సీజ్ చేసి అప్పగించిన ఇసుకకు ఈ నెల 5న స్థానిక తహసీల్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లూథర్ విలసన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 63 క్యూబిక్ మీటర్ల(21 ట్రాక్టర్స్) ఇసుకకు 11.30 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనేందుకు 11..20 గంటల లోపు రూ.1000 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వేలం పాట పాడిన వారు వెంటనే డబ్బులు చెల్లించాలని, ప్రభుత్వ మద్దతు రాని ఎడల వేలంపాటను రద్దు చేసే అధికారం తమకే ఉందన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ఖమ్మంక్రైం: సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖమ్మంలోని కిన్నెర నర్సింగ్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాల పేరిట ఫోన్లకు ఆన్‌లైన్ అప్లికేషన్లు పంపిస్తారని, అవి ఇన్‌స్టాల్ చేసుకుంటే ఖాతా నుంచి నగదు చోరీకి గురయ్యే అవకాశముందని తెలిపారు. ఈమేరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం.ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ అశ్విన్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(టీయూసీఐ) అనుబంధం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పేరబోయిన వెంకన్న, జిల్లా కార్యదర్శిగా గోను పుల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మంలో బుధవారం జరిగిన మహాసభలో ఉపాధ్యక్షులుగా గొడుగు విజయ్, నీలకంటి వెంకటనరసయ్య, పసుపులేటి నరసింహారావు, సహాయ కార్యదర్శిగా శీలం లెనిన్, మేకనబోయిన ప్రభాకర్, పెదపాక వెంకన్న, కోశాధికారిగా నాగరాజులతో మరో 19 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ.. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో జిల్లా నాయకులు జి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని సీపీఐ, ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీలు గుర్తించి నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు విద్యా ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుతోనే జాబ్ క్యాలెండర్ వేయలేదని ప్రభుత్వం మాట్లాడడం శోచనీయమన్నారు.ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు కొల్లేటి నాగేశ్వరరావు, మంగతాయి, కె.శ్రీను, శోభ, లక్ష్మణ్ ,బల్లెపల్లి వెంకటేశ్వర్లు, భరత్ పాల్గొన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శరత్


నియామక పత్రం అందుకుంటున్న శరత్

ఖమ్మం లీగల్: ఖమ్మం జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జమ్ముల శరత్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. 1999 నుంచిఖమ్మం జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న ఆయన తొలుత సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశారు. గతంలో సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా, ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేయడమే కాక కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గానూ కొన్నాళ్లు కొనసాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రోత్సాహక పథకాన్ని వినియోగించుకోండి

ఖమ్మం సహకారనగర్: ఉపాధి సంబంధిత ప్రోత్సాహక (ఈఎల్ఐ) పథకాన్ని వినియోగించుకోవాలని వరంగల్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వై.డీ.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.99,446 కోట్ల ఆర్థిక వ్యయంతో రెండేళ్ల వ్యవధిలో 3.5కోట్ల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఆమోదించిందన్నారు. ఈ పథకం ప్రయోజనాలు 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 మధ్య సృష్టించబడిన ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తాయన్నారు. 50 మందికి తక్కువ ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం 2 కొత్త ఉద్యోగులను, 50 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం 5 మంది కొత్త ఉద్యోగులను నియమించి ఆరు నెలల పాటు నిరంతర సేవ చేస్తే ఈ పథకానికి అర్హులన్నారు. మరింత సమాచారం కోసం వరంగల్ పీఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


మానవహారంగా ఏర్పడిన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఇచ్చిన 72 గంటల కాలేజీల బంద్‌లో భాగంగా మొదటిరోజు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బుధవారం ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంతంలో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. అనంతరం మంత్రి తుమ్మల క్యాంప్ ఆఫీస్ వైపు వెళ్తున్న క్రమంలో పోలీసులు అడ్డగించి అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ మాట్లాడుతూ..ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. అరెస్టులతో విద్యార్థి ఉద్యమాన్ని అణిచి వేస్తామనుకుంటే గత పాలకులకు పట్టిన గతే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పడుతుందన్నారు. నాయకులు ఉదయ్, కిరణ్, అజయ్, సందీప్, అనిల్, గోపి పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నాయకుల ముందస్తు అరెస్ట్

నేలకొండపల్లి: అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లేబోయిన ఉపేందర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగే అమెరికా రాయబార కార్యాలయ ముట్టడికి వెళ్లకుండా సంఘం నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆందోళనకారులను నిర్బంధం చేయడం సరికాదని, ప్రభుత్వ తీరు మారకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు బాలిన కృష్ణంరాజు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ తుళ్లూరు భారతమ్మ (73) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు బండి జగదీష్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, గొడవర్తి నాగేశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎంపీ పరామర్శ

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ గ్రామానికి చెందిన నేలకొండపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్ తండ్రి కృష్ణయ్య అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా.. బుధవారం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి ఆయనను పరామర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 46వ డివిజన్ పరిధిలో బాధిత కుటుంబాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సులతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ బుధవారం ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, నాయకులు బాణాల లక్ష్మణ్, చుంచు వెంకటేశ్వర్లు, సాయి, రాము పాల్గొన్నారు.

యూటీ నిర్మాణ పనుల పరిశీలన


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

కూసుమంచి: పాలేరు వద్ద ఎడమ కాల్వకు నిర్మిస్తున్న యూటీ నిర్మాణ పనులను తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండపర్తి గోవిందరావు బుధవారం సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది అకాల వర్షాలకు యూటీ కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడు నిర్మించే యూటీని పటిష్టంగా నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. పంటలకు ఇబ్బందులు లేకుండా సాగునీటిని విడుదల చేసేలా పనులను నాణ్యతగా చేపట్టడంతో పాటు త్వరితగతిన పూర్తిచేసి అందించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నాయకులు రవింద్రబాబు, రవి, రామకోటి, వెంకటరెడ్డి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, మల్లికార్జున్‌రావు, చందర్‌రావు, శంకర్‌రావు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సిలార్‌సాహెబ్

తిరుమలాయపాలెం: సీజనల్ వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాల నివారణ చర్యలపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని మండల ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ అన్నారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెం రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లను గుర్తించాలని, సీజనల్ వ్యాధులు, భారీ వర్షాలు వరదల సమాచారం కోసం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలన్నారు. గతేడాది డెంగీ కేసులు నమోదైన ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. అత్యవసర సాయం కోసం ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ 1077 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పి.సూర్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి సుబ్లేడు, తిరుమలాయపాలెం పీహెచ్‌సీ వైద్యులు వసుంధర, మహిధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఖలీల్, ఇరిగేషన్ ఏఈ రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా కలప దందా..!

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- అనుమతులు లేకుండా అక్రమరవాణా
- నిబంధనలు పట్టించుకోని అక్రమార్కులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం


ట్రాక్టర్‌లో చెట్ల మొద్దులను తరలిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా పచ్చని చెట్లను తమ ఇష్టారాజ్యంగా నరికి కట్టెల మిల్లులు, ఇటుక బట్టీలకు అక్రమ రవాణాదారులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామాల్లోని పంటపొలాలు, బీడు భూముల్లో ఉన్న చెట్లను నరికి తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ పాలేరు నియోజకవర్గంలో ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికేసి మిల్లులకు తరలిస్తున్నారు.

మిల్లులకు తరలింపు..

ఇదిలా ఉండగా పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లోన అక్రమరవాణాదారులు నిబంధనలను తుంగలో తొక్కి పొలాలు, బీడు భూముల్లో ఉన్న రకరకాల చెట్లను నరికి కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లోని సామిల్లులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం దాడులు చేసిన దాఖలాలే లేకపోవడంతో సంబంధిత అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఎవరో ఫిర్యాదు చేస్తే తప్పా ఉన్నతాధికారుల మెప్పు కోసం తూతూమంత్రంగా దాడులు చేస్తున్నారే తప్ప పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. పర్యావరణానికి నష్టం ఉండదని సర్టిపై చేశాకే తరలించాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా రావాణా జరుగుతోంది.

ఇటుక బట్టీలకు..

ఇటుక బట్టీలు కాల్చడానికి కలప తప్పని సరిగా వాడాల్సి ఉంటుంది. దీంతో అడ్డగోలుగా చెట్లను నరికి రూరల్ మండలంలోని పల్లెగూడెం, ఎంవెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, గొల్లగూడెం, గుదిమళ్ల, తిరుమలాయపాలెం మండలం బచ్చోడు, కాకరవాయిలో గల ఇటుక బట్టీలకు రేయింబవళ్లు కలపను తరలిస్తున్నారు. అటవీచట్టం ప్రకారం చింతచెట్లను, మోదుగు చెట్లను నరికి తరలించకూడదు. ఇలా చేస్తే కఠినమైన శిక్షలుంటాయి. అయినా ఇవేమీ పట్టనట్లు అన్ని రకాల చెట్లను నరికి ఇటుక బట్టీలకు, సామిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేలుకోకపోతే పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లడంతో పాటు చెట్లు అంతరించి పోయే ప్రమాదముంది.

పేరుకే వాల్టా చట్టం..

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టప్రకారమే పర్యావరణానికి నష్టం కలగకుండా అనుమతులు పొంది చెట్లు, కలప, మట్టి, ఇసుకను తరలించాలి. కానీ ఇక్కడ అవేవీ పట్టించుకోకుండా చెట్లను నరికి తరలిస్తున్నారు. అయినా అటవీశాఖ అధికారులు, పర్యావరణాన్ని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో చెట్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఈ దందాను అధికారులు అడ్డుకోకుండా వారిని మచ్చిక చేసుకొని వాల్టా చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని దళారులు రెచ్చిపోతున్నారు.